# వాన రాత్రి

సాయంత్రం నుంచీ ముసురుగా వుంది. శేషగిరి సైకిల్ వరండాలో పెట్టేసి ఇంట్లోనే కూర్చున్నాడు. శారద వేడివేడి ఉప్మా కాఫీలు తయారుచేసింది. ఇద్దరూ సరదాగా కబుర్లు చెప్పుకుంటూ తిన్నారు.

"తొందరగా ప్లేట్లు కడిగేసిరా! కాస్సేపు పేకాడు కుందాం" అన్నాడు శేషగిరి.

"ఈ పూటకి కూరేం లేదు. వంట మొదలు పెట్టాలి" అంది శారద లేస్తూ.

"కందిపప్పు వుందిగా? చాల్లెద్దూ, అంతకన్నా ఏం కావాలీ? ఆనక వేడివేడిగా అన్నం ఒక్కటీ వండుకో వచ్చు. చల్లగా వర్షం పడుతోంటే, వాతావరణం ఇంత హాయిగా వుంటే, పొయ్యి అంటిస్తానంటా వేమిటీ?" అని విసుక్కున్నాడు శేషగిరి.

శారద నవ్వింది. "కబుర్లకేం? తీరా అన్నం ముందు కూర్చున్నప్పుడు చూడాలి అబ్బాయి గారి మొహం! తుమ్మల్లో పొద్దుగూకినట్టే అవుతుంది. అర గంటలో వంట తెముల్చుకు వచ్చేస్తాను. ఏమైనా చదువుకుంటూ కూర్చోరాదూ?"

"నీ పతి భక్తికి సంతోషించానుగానీ తొందరగా చేతులు కడుక్కుని రద్దూ! నీకంత అనుమానమైతే చూస్తావుగా, ఆనక? వండిన అన్నమంతా నేనే తినే స్తాను, సరేనా? కాదంటే నా రెయిన్‌కోటు తెచ్చిపడేయ్. బజారంతా తిరిగివస్తాను."

శారద మాట్లాడకుండా చేతులు కడుక్కు వచ్చింది. "నేను కేరమ్స్ అయితేనే ఆడతాను."

"లేకపోతే?"

"మీ రెయిన్‌కోటు తెచ్చి పడేస్తాను."

"ఒద్దులే కూర్చో" — పేక డెస్కులో పడేసి కేరమ్స్ బోర్డు తెచ్చాడు.

ఎప్పటికప్పుడు శారదని దగా చేస్తూనే నెగ్గాడు శేషగిరి. తెలిసికూడా నవ్వుతూ భర్తగారి దగ్గిర ఓటమిని అంగీకరించటం శారదకి సంతోషం.

"బాగా చీకటిపడిపోయింది. ఇక చాలు. లేచి పోదాం" అంటూ లేచింది శారద. తను స్టౌ అంటిస్తూ పక్కలువేసే డ్యూటీ శేషగిరికి అప్పగించింది. అన్నం వార్చేసి, స్నానంచేసి వచ్చింది.

గోలెంలోంచి మరువం కొమ్మలు తెంచి ఒక జానెడు మాలకట్టి అందించాడు శేషగిరి.

"నేను చెప్పాలనుకుంటూనే మర్చిపోయాను. మీరే కట్టారా?" అంది శారద మాల జడలో సర్దు కుంటూ.

"చూశావా? నీ మనసులో కోరిక గ్రహించాను" అని గర్వంగా చూశాడు శేషగిరి.

"అయితే నా మనసుని మీరు చదవగలరన్న మాట!" అంది శారద నవ్వుతూ.

"అందుకు సందేహమా? సింగారం తర్వాతగానీ, తొందరగా అన్నాలు వడ్డించు, ఆకలేస్తోంది. అయిదు నిమిషాల్లో వచ్చేస్తాను" అంటూ టవల్ భుజంమీద వేసుకుని స్నానానికి వెళ్ళాడు శేషగిరి.

★ ★ ★

భోజనాలయ్యాయి అన్నట్టు శేషగిరి కందిపప్పుతో ఒక్క ముద్దకూడా తినలేదు. ఖారం ఖారంగా ఆవ కాయతో తిని మజ్జిగ తాగాడు. వక్కపొడి చప్పరిస్తూ ఇద్దరూ చెరో పుస్తకం తెరుచుకుని కూర్చున్నారు.

"నేను నిన్ను పలకరించను, నువ్వు నన్నూ పలకరించకు" అన్నాడు శేషగిరి.

"మరి ఏమైనా అవసరం వస్తే...?" అంది శారద.

"ఎవరి అవసరాలు వాళ్ళే చూచుకోవాలి."

"అయితే పెద్ద పాము గదిలో కొచ్చేస్తుందను కోండీ. అప్పుడూ?"

"అది నిన్ను కరవటానికి వచ్చేస్తోంటే నువ్వు చంపెయ్. నన్ను కరవటానికి వస్తోంటే నేను చంపు తాను. ఆహా, అలా కాదు. పాము గదిలోకి రాగానే నేనే చంపేస్తాను. నిన్ను నేనే రక్షించాలి కదా? నా

పిస్టల్‌తో కాల్చేస్తాను."

"దీపావళి పిస్టలేనా?" అని శారద విరగబడి నవ్వింది.

బయట జోరుగా కురుస్తోన్న వర్షంలో, ఆ హోరులో, వీధి తలుపుల మీద దబదబా బాదుతోన్న శబ్దం వినవచ్చింది.

"ఎవరో తలుపులు కొడుతున్నట్టుంది కదూ?" అంది శారద.

"పాము గారేమో! వెళ్ళి చూడు."

"అమ్మో, నాకు భయం బాబూ!"

తలుపుల మీద మళ్ళీ మళ్ళీ చప్పుడౌతూంటే శేషగిరి లేచాడు. శారద వెనకే వెళ్ళింది.

తలుపులు తీసీ తియ్యగానే లోపలికి జొరబడ్డ వ్యక్తి తలా ఒళ్ళూ పూర్తిగా తడిసి ముద్దయిపోయి వున్నాడు. లాల్చీ పైజమా ఒంటికి రేకుల్లా అంటుకు పోయాయి. జుట్టులోంచి నుదుటి మీదుగా, చెంపల మీదుగా, మెడ మీదుగా, నీళ్ళు ధారలు కడు తున్నాయి. ఒక్కసారిగా అతన్ని చూస్తే శారదకి గజగజా చలివేసినట్టయింది. అప్రయత్నంగా రెండు చేతులూ పమిటి మీదుగా ముడుచుకుంది.

అతను మొహం మీద కారుతున్న నీళ్ళు చేతు లతో తుడుచుకుంటూ, నవ్వుతూ శేషగిరికేసి చూశాడు. "నేనన్నయ్యా, రాంబాబుని."

"ఆఁ, తెలుసు" — ముభావంగా అన్నాడు శేష గిరి. అతన్ని చూసీ చూడగానే శేషగిరిలో ఎంతో మార్పు వచ్చేసినట్టు శారదకి స్పష్టంగా అర్థమైంది. అంత వరకూ నవ్వుతూ నవ్వుతూ వున్న శేషగిరి బొత్తిగా మొహం ముడిచేసుకున్నాడు.

రాంబాబు చేతి వేళ్ళూ, భుజాలూ కదలటం కన్పించింది శారదకి.

అతను చలితో వణికిపోతున్నాడు. అలాగే నవ్వుతూ "ఆఖరి బస్సు అందలేదన్నయ్యా! లేకపోతే ఇంటికే వెళ్ళిపోయే వాణ్ణి. ఫ్రెండ్ రూమ్‌కి వెళ్దామా అంటే ఈ వర్షం ఒకటి తెరిపిలేకుండా పట్టుకుంది ..... చటుక్కున మీ ఇంటిమాట జ్ఞాపకం వస్తే బస్‌స్టాండ్ నించి పరిగెత్తుకు వచ్చాను" — మాట్లాడుతూంటే అతని గొంతు కూడా వణుకుతూనే వుంది.

అకస్మాత్తుగా వూడిపడ్డ ఈ మరిది ఎవరో శారదకి తెలీలేదు. భర్తగారి వేపు బంధువుల్లో ఈ పేరు కూడా ఎప్పుడూ విన్నట్టు గుర్తు రాలేదు. ఎవరైతేనేం? అతనలా తడి బట్టల్లో మునిగి వొణికిపోతూ వుంటే తామిద్దరూ ఎదురుగా చోద్యం చూస్తూ వూరుకోవడం నచ్చలేదు శారదకి.

"వదినా! కొంచెం తుండుగుడ్డ ఇస్తారా? ఒళ్ళు తుడుచుకుంటాను" అన్నాడు రాంబాబు ప్రాధేయ పడుతున్నట్టు.

"ఆఁ, శారదా! ఇందాక టవలు తలుపుమీద పడేశాను. అది తెచ్చియ్యి" అన్నాడు శేషగిరి అప్పుడే తేరుకున్నవాడిలా.

అతను స్వయంగా అడిగేవరకూ కాస్త ఒళ్ళు తుడుచుకోమని టవలు ఇవ్వలేక పోయినందుకు నొచ్చుకుంటూ గబగబా లోపలికి వెళ్ళింది శారద. తలుపు మీద పడేసిన టవలు అప్పటికే ముద్దలా వుంది. దాంతో అతనెలా తుడుచుకుంటాడు?

అలమారు తెరిచి తెల్ల టవలు తీసికెళ్ళి అందిం చింది.

పేదవాడికి పెన్నిధి దొరికినంత సంతోషంగా రాంబాబు పొడి టవలు విప్పి బుర్రచుట్టూ వేసుకుని గబగబా రుద్దుకున్నాడు.

నవ్వు మొహంతో శేషగిరికేసి చూసిన శారద, అతని చూపుల్లో ఎర్రదనానికి అదిరిపడింది. చూపులు తిప్పుకుని నించుంది.

రాంబాబు లాల్చీ, బనీనూ విప్పి గుమ్మం బైట సోలెడేసి నీళ్ళు పిండి ఒక్కో దులుపు దులిపి మళ్ళీ తొడుక్కున్నాడు.

శారద గబగబా లోపలికి వెళ్ళి మూసీముయ్యని అలమారులోంచి లుంగీ అందుకుంది.

"ఏంటిది?" శారద వెనుకే వచ్చిన శేషగిరి కర్క శంగా అన్నాడు.

"లుంగీ ఇద్దామని."

"అక్కర్లేదు. అక్కడ పెట్టు."

"పాపం అతను బట్టలన్నీ తడిసిపోయి వణుకు తున్నాడు."

"అయితే నీ పట్టుచీరపెట్టి వాడి ఒళ్ళు తుడిచి

వెచ్చవెచ్చగా పడుకోబెట్టు! వాడు ఉత్త తిరుగుబోతు వెధవ, తెలుసా? అంత జాలా నీకు వాడిమీద?"

నిర్ఘాంతపోయింది శారద. "అదేమిటి? నేనేం చేశాను?" అంది ఆశ్చర్యంగా చూస్తూ.

"తలుపుమీద తుండు తెమ్మంటే ఇస్త్రీ మడత తీసి అందించావు. వాణ్ణి చూడగానే మతి చలించిందేంటి?"

"ఛీ! అవేం మాటలు? ఆ తుండు బొత్తిగా తడిసి వుందని..." — శారద కంఠానికి దుఃఖం అడ్డుపడింది. మాట్లాడలేకపోయింది.

"అన్నయ్యా!" రాంబాబు పిలుపుకి శేషగిరి విసురుగానే వెళ్ళాడు.

నీళ్ళు పిండిన పైజమా మళ్ళీ తొడుక్కుని తుండు కిటికీ మీద ఆరవేస్తూ నవ్వుతూ అన్నాడు రాంబాబు. "తుండంతా జిడ్డుజిడ్డయింది. వదిన రేపు విసుక్కో కుండా వుతుక్కోవాలి."

శేషగిరేం మాట్లాడలేదు.

శారద మతిపోయిన దానిలా అవతలి గదిలోనే నిలబడిపోయింది.

"వెధవ వర్షం వూపిరి పీల్చుకోనిచ్చింది కాద న్నయ్యా! ఏ సినిమా కన్నా పోదామా అంటే బట్టలన్నీ ముద్దముద్దయ్యాయి. మీకు ఇబ్బందేగానీ ....."

"ఆఁ, దానికేంలే."

రాంబాబు మళ్ళీ అన్నాడు లోపలికి వినపడేలా. "వదినా! ఒక చాప వుంటే పడెయ్యి, చాలు. చీకటితో లేచి ఫస్టు బస్సుకి వెళ్ళిపోతాను."

మడత మంచం గోడకి ఆన్చి వుండనే వుంది. అయినా ఏం చెప్పటానికీ జడిసింది శారద.

శేషగిరే అన్నాడు — "ఆ మంచం వాల్చుకుని పడుకో."

రాంబాబు మడత మంచం వాల్చాడు. కిటికీ మీదనించి తడి తుండు తీసి వుండలా చుట్టి ఒక వేపున పెట్టాడు. శేషగిరికి ఏమనిపించిందో గానీ ఒక చిరుగుల దుప్పటి మాత్రం తెచ్చి పడేశాడు మంచం మీద. "దుప్పట్లన్నీ నిన్నే చాకలికి పడ్డాయి" అన్నాడు వినీ వినిపించకుండా.

"ఫరవాలేదన్నయ్యా, ఫరవాలేదు. పక్క లేక పోయినా ఫర్వాలేదు నాకు" అంటూ చిరుగుల దుప్పటి మంచం నిండా పరుచుకున్నాడు.

శారద మనస్సు కొట్టుకులాడింది. హృదయం ద్రవించినట్టయింది. గిన్నిలో అన్నం మిగిలింది. కంది పొడి వుంది. పచ్చళ్ళు వున్నాయి. పెడితే తింటాడేమో! లుంగీ ఇస్తే కట్టుకుని తడిబట్టలు ఆరబెట్టుకోడా? ఇంకో దుప్పటి ఇస్తే కప్పుకోడా? అమ్మో, ఇంకేమన్నా వుందా? తువ్వాలు ఇచ్చినందుకే నోటికొచ్చినట్టు అన్నారు. ఇక అన్నం పెట్టడం కూడానా? పోనీ కొంచెం మంచినీళ్ళన్నా అక్కడ పెడతాను.

చెంబుతో నీళ్ళు తీసుకువెళ్ళి గుమ్మం దగ్గిరే పెట్టి ఇవతలికి వచ్చేసింది.

'తిరుగుబోతు' అట! అయితే ఏమిటి? తడిసి ముద్దయిపోయి వచ్చిన మనిషిని అలాగేనా చూసేది?

తన ఆలోచనలు తన కడుపులోనే వుంచుకుని గదిలోకి వెళ్ళి కళ్ళు మూసుకుని పడుకుంది.

శేషగిరి కోపం శారదకు కొత్త కాదు. నచ్చినప్పుడు నెత్తిమీద కెక్కించుకుంటాడు. లేకపోతే ... కాలికింద పెట్టి నల్లిని పామినట్టు పాముతాడు. అయినా తనేం చేసింది మధ్య? అతన్ని చూచి కాస్త జాలిపడింది. అది తప్పా?

★ ★ ★

అర్ధరాత్రి దాటి వుంటుంది. శారద నెమ్మదిగా లేచి గది తలుపులు తీసుకుని రాంబాబు మంచం దగ్గర్నుంచి వరండాలోంచి బాత్ రూంకేసి వెళ్ళింది. తిరిగి వచ్చేసరికి చీకట్లో రాంబాబు లేచి మంచం మీద కూర్చుని వున్నాడు. "వదినా! దాహం వేస్తోంది. కొంచెం మంచి నీళ్ళిస్తారా?" అన్నాడు ఎంతో సంకోచంగా.

"అయ్యో, తలుపు పక్కనే వున్నాయండీ! ఇందాకే పెట్టాను. మీరు చూశారనుకున్నాను" అంది శారద.

రాంబాబు చీకట్లోనే తచ్చాడుతూ వెతికాడు నీళ్ళ చెంబుకోసం.

"అలాక్కాదు. వుండండి, నేను లైటు వేస్తాను."

స్విచ్చి కోసం శారద రాంబాబు మంచం దగ్గిరగా వెళ్ళింది.

అంతలోనే రాంబాబు కాలికి తగిలిన నీళ్ళ చెంబు భళ్ళుమని చప్పుడు చేసుకుంటూ దొర్లింది.

శారద స్విచ్చి వెయ్యకుండానే లైటు వెలిగింది!

శారద చెంపమీద దెబ్బ పడింది!

కెవ్వుమన్న శారద శబ్దం రానివ్వకుండా చెంప పట్టుకుని కొయ్యబారి నించుంది.

"అన్నయ్యా! అదేంటీ?" ఆశ్చర్యంగా అన్నాడు రాంబాబు శేషగిరిని చూస్తూ.

"ఛీ! నోర్ముయ్! ముందు నా గుమ్మం దిగు" గర్జించాడు శేషగిరి.

శారద దించిన తల ఎత్తకుండా గదిలోకి వెళ్ళబోయింది.

"ఆగు! నువ్వు కూడా వాడివెనకే ఫో!" భర్త గర్జన!

సంగతేమిటో అర్థమైంది రాంబాబుకి. గజగజా వణుకుతూ అన్నాడు — "అన్నయ్యా! నేను మంచి నీళ్ళడిగాను దాహం వేస్తోందని."

"నీ దాహం సంగతి తెలుసులే. ఇదేగా నువ్వు వెలగబెట్టే ఘనకార్యం? ఆడవాళ్ళు కనపడితే చేతులు లాగటమేగా? నీ గురించి తెలీని వెధవెవడున్నాడోయ్! అంత్య నిష్ఠూరం కన్నా ఆది నిష్ఠూరం మేలని మొదట్లోనే నా గుమ్మంలో అడుగుపెట్టడానికి వీల్లేదు పొమ్మనాల్సింది. పోనీలే అని ఊరుకున్నాను. అందుకేగా నీకింత ధైర్యం వచ్చింది!"

"అన్నయ్యా!" రాంబాబు నిర్ఘాంతపోతూ అన్నాడు. "నువ్వనుకున్నట్టు కాదన్నయ్యా! ఎప్పట్నించో దాహం వేస్తోంది. మిమ్మల్ని లేపలేక వూరుకున్నాను. వదిన బయటికి వస్తే అడిగేశాను. నీళ్ళు ఇక్కడే వున్నాయని చెప్పింది. తను లైటు వేస్తానంది. అంతలోనే..."

"పానకంలో పుడకలాగ నేను వచ్చాను కదూ? సరే, నీతో మాటలెందుగ్గానీ ముందు నా గుమ్మం దిగు!"

"వెళ్తానన్నయ్యా! ఇప్పుడే వెళ్ళిపోతాను. నన్ను నువ్వు ఎందుకు అనుమానించావో నాకు తెలుసు. కానీ నువ్వు విన్నదంతా అబద్ధం. నేను అంత దుర్మార్గుణ్ణి కాను."

"సరేలే, ఎంత దుర్మార్గుడివో తర్వాత చెపుదువు గానిలే. ముందు ఇక్కణ్ణించి కదులు!" అసహనంగా అరిచాడు శేషగిరి.

రాంబాబు అప్పటికే మంచం ఎత్తి గోడకి ఆనించాడు. దుప్పటి మడత పెట్టాడు.

"అన్నయ్యా! నీ పాదాల సాక్షి. నన్ను నమ్ము. వదిన నాకు తల్లిలాంటిది. ఎంత పాపం చేసుకున్నానో పుట్టగానే తల్లిని పోగొట్టుకున్నాను. వదినలాంటి తల్లుల్ని కూడా నాకు దూరం చెయ్యకు. వదిన ఏ పాపం ఎరగదు. ఆవిణ్ణి ఏమీ అనకు."

"ఛీ! నీకు సిగ్గుకూడా లేదా? ఆవిడ కోసం నీకెందుకంత తాపత్రయం? చేసిన తప్పు ఒప్పుకుని చెంపలేసుకున్నా కొంత పాపం పోతుంది. ఆవిడ చెయ్యి పట్టుకోబోయావా లేదా?"

శారద లోపలినించి అంతా వింటూ నిర్ఘాంతపోతూ నిల్చుంది.

"అయ్యో అన్నయ్యా! నేనలా చెయ్యలేదన్నయ్యా! నన్ను నమ్ము! నీ మీద ఒట్టు!"

"నమ్ముతాలే. చాలా నీతిపరుడివని నిన్ను నమ్ముతాను."

రాంబాబు సజల నేత్రాలతో శేషగిరికేసి చూసి తల దించేసుకున్నాడు. 'వెళ్తానన్నయ్యా!' అంటూ గబగబా వీధి తలుపు తీసుకుని బయటపడ్డాడు.

రాంబాబు వీపువెనకే తలుపులు మూసుకున్నాయి.

రాంబాబు కాళ్ళు ముందుకు సాగలేదు. ఒక్క అడుగుకూడా పడలేదు. అన్నయ్య, వదిన్ని తన ముందే చెంపమీద కొట్టాడు. ఇంకా కొడతాడా? ఈ వానరాత్రి బయటికి గెంటేస్తాడా? అసలే కోపిష్టి మనిషి! అయ్యో, తనేం చెయ్యాలి ఇప్పుడు?

తనకి ఒక్కరాత్రి నిలవనీడ ఇవ్వటానికి ఏ గృహస్థయినా జడుస్తాడనీ, తన పరిసరాల్లో మసలినంత మాత్రాన్నే ఏ ఇల్లాలికైనా నీలాపనిందలు వస్తాయనీ ఇంతకాలం అతనికి తెలీదు.

ఏం చెయ్యాలి తనిప్పుడు? అన్నయ్య ఎలా శాంతిస్తాడు?

రాంబాబు ఆవేశంగా వెనక్కి తిరిగి ఆ ఇంటి తలుపులు దబదబా బాదాడు.

తలుపులు భళ్ళున తెరిచాడు శేషగిరి.

రాంబాబు తూలి పడబోయి ఆపుకున్నాడు "అన్నయ్యా! నిజం చెప్పేస్తాను. నేను చాలా చెడ్డ ఉద్దేశంతోనే వదిన్ని పలకరించాను. వదిన ఎలాంటిదో

నాకు తెలీదు. నా మాటకి సమాధానమే ఇవ్వలేదు. చెయ్యి పట్టుకోబోయాను. అంతలో .... అంతలో నువ్వు వచ్చేశావు. చాలా తప్పు చేశానన్నయ్యా! చాలా బుద్ధిలేని పని చేశాను. క్షమించన్నయ్యా! వదిన్ని కూడా క్షమించమని చెప్పు. నువ్వు కేకలెయ్యడం చాలా మంచిదైంది. వదిన్నేమీ అనకన్నయ్యా! వెళ్తాను" అనేసి గబగబా అంగలేసుకుంటూ జోరుగా కురుస్తోన్న వానలో, చీకట్లో కలిసిపోయాడు.

శారద లోపలి గదిలోంచి కంగారుగా వస్తూ — "అయ్యో, అది నిజం కాదు. అతను అబద్ధం చెపు తున్నాడు. అతను నన్నేమీ అనలేదు. నా చెయ్యి ముట్టుకోలేదు. మంచి నీళ్ళడిగాడు అంతే, పాపం మంచినీళ్ళడిగాడు" అంటూ బావురుమంది.

శేషగిరి కోపంగా —"వాడే ఒప్పుకున్నాడు. నువ్వు కాదంటావేం? నేనన్నట్టే అయింది. వాణ్ణి నువ్వెందుకు వెనకేసుకొస్తావు?" అని అరిచాడు.

"అయ్యో, కాదు. అతను నన్నేమీ అనలేదు. ఎందుకో అలా చెప్పాడు. నిజంగా మంచినీళ్ళే అడిగాడు. అంతే" అంది శారద గబగబా.

"వాడసలు తిరుగుబోతు వెధవని మొదటే చెప్పా. వాడికోసం మంచి నీళ్ళెందుకు పెట్టాలి నువ్వు?"

"అయ్యో!........" అని ఏడుస్తూ వెళ్ళిపోయింది శారద.

ఒక తిరుగుబోతుని తెలివిగా పట్టుకున్నాననే సంతోషంతో శేషగిరి, తెరిచిన తలుపుల దగ్గిర అలాగే నిలబడ్డాడు, వానలోకి చూస్తూ. తన ఇంట్లో రాంబాబు చేసిన అఘాయిత్యం బంధువుల్లో అందరికీ చాటాలనే సంబరంతో!

[1964 డిసెంబరు కరుణామయి మాస పత్రికలో] ★

**ఈ కథ గురించి:**

దీని మీద నాకు చాలా విమర్శ వుంది.

ఈ భార్యాభర్తలు, కథ ప్రారంభంలో ఎలా వున్నారు? 'ఇంత ముచ్చటైన జంట ఇంకెక్కడా వుండదు' అన్నట్టుగా వున్నారు. సరదాగా మాట్లాడుకున్నారు. కేరమ్స్ ఆడుకున్నారు. అతను, ఆమెకి మరువం మాల కట్టి ఇచ్చాడు. కూరలు లేకపోయినా, సరిపెట్టేసుకుని భోజనం చేశాడు. మళ్ళీ కబుర్లు చెప్పుకుంటూ పుస్తకాలు చదువుకుంటూ కూర్చున్నారు.

తర్వాత దృశ్యం ఎలా వుంది? ఆ భర్త అంత క్రూరుడూ నీచుడూ ప్రపంచంలో వుండడు. భార్యని నిష్కారణంగా అనుమానించే, హింసించే పశువు వాడు.

ఇంత పశువు అయిన భర్త, ఏనాడైతే మాత్రం అంత సరసుడిగా ప్రవర్తిస్తాడా?

వీణ్ణి గురించి, భార్య ఏమనుకుంది? 'ఇష్టమైతే నెత్తిన పెట్టుకుంటాడు. లేకపోతే కాలికింద పాముతాడు' అనుకుంది. అంటే, వాడు నెత్తికి ఎక్కించుకున్న పూట అక్కడికి ఎక్కడం, కాలి కింద పామిన పూట అక్కడ పడి నలగడం చేస్తోందన్న మాట ఈ భార్య! ఈ రెంటికీ సిద్ధంగానే వుంది!

అంత పశువు అయిన భర్తతో ఆ భార్య అంత సరస సల్లాపాలతో గడపడం ఏమిటి?

ఇప్పుడు రాంబాబు సంఘటన జరిగింది కదా? ఈ సందర్భంలో, ఈ భర్త, భార్యని అనుమానించాడు. దుర్భాష లాడాడు. చెంప మీద కొట్టాడు.

ఈ సంఘటన తర్వాత మర్నాటి నించీ ఈ భార్యాభర్తలిద్దరూ ఎలా వుంటారు? బహుశా ఒక పూటన్నర వరకూ ఎడమొహం పెడమొహంగా వుంటారు. తర్వాత, వాడు నెమ్మదిగా మాటలు కలుపుతాడు. ఆవిడ, మహా అయితే ఏడుస్తుంది కాస్సేపు. వాడు, ఆమెని 'కౌగిట్లోకి' లాక్కుం

టాడు. ఆమె, వాడి బాహువుల్లో వాలిపోతుంది. ఇక, రాంబాబు సంఘటన అక్కడితో ఆఖరు! తర్వాత పూటనించీ మళ్ళీ సరస సల్లాపాలు!

వీళ్ళ మధ్య గతంలో కూడా ఎన్నో సంఘటనలు జరిగి వుంటాయి కదా? ఈ భార్య, ఎన్నో అవమానాలూ హింసలూ పడే వుంటుంది కదా? ఆ అనుభవాలన్నీ మనసులో పేరుకుంటాయి కదా? మరి, ఈ భార్య, ఈ భర్తతో, ఆ సాయంత్రం అంత సరస సల్లాపాలతో ఎలా వుండగలిగింది?

ఈ కథలో నాకు కనపడుతోన్న లోపాలు ఏమిటంటే: అంత పశువు అయిన భర్త, భార్యతో, అంత స్నేహ ప్రవర్తనతో వుండడు. అలా వున్నట్టు చూపించడం అంటే, అది ఆ పాత్ర చిత్రణలో లోపమే.

భార్య సంగతి తీసుకుంటే — ఎప్పటికప్పుడు ఎన్నో అవమానాలు పడుతూ వున్న మనిషి, భర్త దగ్గిర, అంత ఉత్సాహంగా ఎలా వుండగలదు? ఒంట్లో చీమూ నెత్తురూ లేకపోతేనే వుండగలదు. ఆ పాత్రచిత్రణ ఎలా వుండాలంటే, కథా ప్రారంభంలో కూడా, భర్త మీద అసంతృప్తీ, నిరుత్సాహం, అతని మాటలకు సంతోషంగా స్పందించలేకపోవడం ... అలా వుండాలి ఆ పాత్ర.

భర్త, అంత సరదాగా వున్నట్టు చిత్రించడమూ తప్పే. భార్య, అంత మూర్ఖురాలిలా వున్నట్టు చిత్రించడమూ తప్పే.

వాడు, ఆ పూట ఏదో కాస్త శాంతంగా వుంటే వుండొచ్చు. ఆమె, ఆ శాంతాన్ని శంకిస్తూ, నిరుత్సాహంగానే వుండాలి. ఈ రెండు పాత్రలూ కథ ప్రారంభంలో అలాగే వుండాలి. కానీ, అలా లేవు.

ఇక్కడ ఎక్కువ తప్పు భర్త పాత్రని చూపించడంలోనే వుంది. వీడు పశువు కదా? ఇలాంటి పశువు, ఒక సందర్భంలో అంత 'సొగసుగా' వుండడం ఎప్పుడూ జరగదు. కాస్త శాంతంగా వున్న క్షణాల్లో కూడా 'భర్తతనం' మిడుకుతూనే వుంటాడు.

ఇక భార్యలు ఎప్పుడూ సిగ్గుమాలిన వాళ్ళే. వీళ్ళు ఎంతసేపూ భర్తల ప్రాపకం కోసం దేవుళ్ళాడుతూ వుంటారు. చెంప మీద కొట్టినప్పుడో, డొక్కలో తన్నినప్పుడో, కాస్సేపు మొహం ముడుచుకుని వుంటే వుండొచ్చుగానీ, ఒక గంట గడిచాక మళ్ళీ మామూలే. 'యావండీ, యావండీ' అని వాడి వెంటబడి తిరుగుతారు. ఆ రాత్రే వాడి పక్కలోకి తయారు! ఇలాంటి భార్యల్లో ఆత్మగౌరవాన్ని ఎక్కణ్ణించి తెచ్చి చూపిస్తాం?

కానీ, చూపించాలి. అంత చచ్చుపుచ్చు భార్యకి కూడా కాస్త ఆగ్రహం కలిగినట్టు చూపించడం మంచిది.

ఒకవేళ, ఆ భార్యలో ఆ స్పందనే లేదని చెప్పదలిస్తే, భార్యమీద ఆ విమర్శ వుండాలి. భర్త — పశువే, నిజమే. మరి, భార్య సంగతేమిటి? అది ఇంకో పశువు. ఆ సంగతి కూడా కథలో చెప్పాలి. అంటే, 'ఈ భర్త ఎప్పుడూ పశువే కదా? అలాంటి వెధవతో ఈ భార్య మొదట్లో ఎంత గంతులేసుకుంటూ వుందో చూడండి! రాంబాబు గొడవ తర్వాత తెల్లారితే ఈ సిగ్గుమాలిన మనిషి మళ్ళీ వాడితో ఇకఇకలూ పకపకలూ చేస్తూనే వుంటుంది! ఇక దీని బతుకు ఇంతే, ఇలా తన్నులు తినడమే!' అని తేల్చాలి కథ. అది జరగలేదు కథలో.

10-6-2004